బీజేపీ డివిజన్ ఇన్‌చార్జ్‌గా కన్నాభిరాం

అడ్డగుట్ట: బీజేపీ డివిజన్ ఇన్‌చార్జ్‌గా తుకారాం గేట్‌కు చెందిన సీ.హెచ్. కన్నాభిరాం నియామితులయ్యారు. సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం డివిజన్ బీజేపీ నాయకులు కన్నాభిరామ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. డివిజన్ ఇంచార్జ్‌గా బాధ్యతలు కేటాయించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కన్నాభిరాం పేర్కొన్నారు.

నియామకం


మనోజ్‌కుమార్

పద్మారావునగర్: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని సనత్‌నగర్ నియోజకవర్గం ఏ–బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి. మనోజ్‌కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలి: మంత్రి తుమ్మల


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రసూల్‌పురా: తెలంగాణ ప్రజలు కోరుకున్న విధంగా సుభిక్షంగా సుపరిపాలన కొనసాగాలంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. జయలక్ష్మి గార్డెన్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. గతంలో మల్కాజ్‌గిరి నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఎంపీగా రేవంత్‌రెడ్డిని ఎంతో ఆదరించారని ఆ ఆదరణే సీఎంగా రేవంత్‌రెడ్డి కావడానికి కారణమైందన్నారు. ఈ సారి కూడా మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పార్టీ ప్రకటించిన అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మేడ్చల్, కంటోన్మెంట్ కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ఎల్‌బీనగర్, మల్కాజ్‌గిరి అసెంబ్లీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లను కట్టించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సునీత మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు సుధీర్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, హరి వర్ధన్ రెడ్డి, వెన్నెల, నక్క ప్రభాకర్ గౌడ్, బండి రమేష్, కొలన్ హన్మంత్‌రెడ్డి, శ్రీగణేష్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జిల్లాగా ఏర్పాటు చేయాలి


సీఎంకు రాసిన లేఖను సాధన సమితి ప్రతినిధులకు అందిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ప్రాంతాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. లష్కర్ సాధన సమితి సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ప్రత్యేక జిల్లా కోసం తమ మద్దతు తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లాగా ఏర్పడాల్సిన అవసరం ఉందని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లు, 40 మున్సిపల్ డివిజన్లతో జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలన సౌలభ్యం ఉంటుందన్నారు. తాము మద్దతు కోరగానే ముఖ్యమంత్రికి లేఖ రాసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రత్యేక జిల్లా ఉద్యమానికి అందరు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల మద్దతు కూడగట్టుతామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సాదం బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, అశోక్, కృష్ణ, రవీందర్‌సాగర్, సునీల్ ముదిరాజ్, జగ్గయ్య ఉన్నారు.

ఇఫ్తార్ విందులో నాయకులు



రసూల్‌పురా: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కార్ఖాన హజ్రత్ లాల షా మహబూబ్ ఖాద్రీ దర్గాలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, పీసీసీ సెక్రటరీ అయూబ్‌ఖాన్, మర్రి అమరేందర్ రెడ్డి, కంటోన్మెంట్ ఇన్‌చార్జి వెన్నెల, నాయకులు శ్రీగణేష్, జమీల్, రియాజ్, ఖాజా, అన్వర్ ఆనంద్‌బాబు, వి. జైప్రకాష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వైద్యుడిగా చెలామణి అవుతున్న వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: అమీర్‌పేటలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో సీనియర్ రెసిడెంట్ వైద్యుడిగా చలామణి అవుతున్న వ్యక్తిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సరూర్‌నగర్ కర్మాన్‌ఘాట్‌కు చెందిన తోట దిలీప్‌కుమార్ 2022 ఆగస్టు 3న ప్రైమ్ ఆసుపత్రిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీలో సీనియర్ రెసిడెంట్ వైద్యుడిగా డ్యూటీలో చేరాడు. అతడి సర్టిఫికెట్లు రెన్యువల్ చేయించే క్రమంలో అనుమానం రావడంతో సర్టిఫికెట్లను మెడికల్ కౌన్సిల్‌లో వెరిఫికేషన్ కోసం పంపారు. ఒర్జినల్ రిజిస్ట్రేషన్ ఐడీలో నకిలీ వ్యక్తులు దూరి పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొంటూ 2022లో రిజిస్టర్ ఆఫ్ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన దాంట్లో దిలీప్‌కుమార్ పేరు కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి హెచ్.ఆర్.హెడ్.వెంకటేష్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దిలీప్‌ను అరెస్టు చేశారు. 2012లో చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన దిలీప్ పర్మనెంట్ మెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం మెడికల్ కౌన్సిల్ నిర్వహించే పరీక్షలో అర్హత సాధించలేదు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే కందుకూరి అనంతకుమార్ సహాయంతో అసలైన వైద్యుల స్థానంలో దిలీప్‌కుమార్ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకుని నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించినట్లు గుర్తించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అమీర్‌పేట: ఓ టీవీ చానల్‌లో వీడియో గ్రాఫర్‌గా పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రావణ్ వివరాల ప్రకారం.. నల్గొండ నేరేడుచర్లకు చెందిన ఝూన్సీ 30 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి బీకేగూడ పార్క్ సమీపంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. ఇళ్లలో వంట పనిచేస్తూ కొడుకు కూతుర్ని పోషించుకుంటుంది.కాగా పెద్ద కుమారుడైన బంటు అఖిలేష్ (26) రెండు నెలల క్రితం నగరానికి వచ్చి ఓ టీవీ చానల్‌లో వీడియో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న ఝూన్సీ బయటకు వెళ్లింది. రాత్రి జ్యోతి అనే మహిళ ఝూన్సీకి ఫోన్ చేసి త్వరగా ఇంటికి వెళ్లు అఖిలేష్ ఉరి వేసుకున్నాడని తెలిపింది. హుటాహుటిన ఇంటికి వెళ్లి తలుపులు బద్దలు కొట్టి చూడగా చీరతో అఖిలేష్ ఉరేసుకుని ఉన్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఆత్మహత్యకు గల కారణాలు, ఫోన్ చేసిన మహిళ ఎవరనేది దానిపై ఆరా తీస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఔట్‌గేట్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం మేరకు పోలీసులు వెళ్లి వివరాలు సేకరించగా మృతుడికి 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడులు

అడ్డగుట్ట: నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. లాలాపేటలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెం –210లో నివాసముంటున్న నీలా వెంకటేశ్వర్లు(54) ఒక బ్రాండెడ్ అల్లం వెల్లుల్లి పేస్ట్ కంపెనీలో పని చేసేవాడు. దీని ద్వారా వచ్చే ఆదాయం అతని వ్యక్తిగత ఖర్చులకు సరిపోవడం లేదని ఉద్యోగం మానేసి తానే సొంతంగా తన ఇంట్లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ చేసి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో వివిధ కెమికల్స్‌ను ఉపయోగించి అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసి నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో సరఫరా చేస్తూ అక్రమంగా సొమ్ము చేసుకునేవాడు. టైటానియం డయాక్సైడ్ మిశ్రమం పెయింట్స్, కోటింగ్స్, పేపర్, ప్లాస్టిక్స్, రబ్బర్, ప్రింటింగ్ ఇంక్స్, కోటెడ్ ఫ్యాబ్రిక్స్, టెక్స్‌టైల్స్, సెరామిక్స్, రూఫింగ్ మెటీరియల్స్, కాస్మెటిక్స్, టూత్‌పేస్ట్, సోప్‌ల తయారీలో వాడుతుంటారు. టైటానియం డయాక్సైడ్, శాంతమ్ గమ్‌ల ద్వారా కంటి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలు తలెత్తుతాయన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సదరు తయారీ యూనిట్‌పై దాడులు చేశారు. నిర్వాహకులు నీలా వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేశారు.1300 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, 20 కిలోల టైటానియం, డయాక్సైడ్, శాంతమ్ గమ్ రూ. 1.72 లక్షల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

దేశభవిష్యత్, అభివృద్ధికి బీజేపీని గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: దేశభవిష్యత్..ధర్మపాలన..అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని దేవీనగర్, పద్మారావునగర్ బ్రూక్ బాండ్‌కాలనీ, బోయిగూడ కట్టెల మండి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ప్రయాణించిందన్నారు. దేశాభివృద్ధితో పాటు శాంతిభద్రతల పరంగా దేశం ఎంతో సురక్షితంగా ఉందన్నారు. భారతదేశ గౌరవాన్ని పేరు ప్రతిష్ఠితలను ప్రపంచ దేశాలకు చాటిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కమలం గుర్తుకు ఓటు వేసి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాలని జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా బోయిగూడ టింబర్ డిపో అసోసియేషన్ ప్రతినిధులు, పద్మారావునగర్ అపార్టుమెంట్ వాసులు పలువురు బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని సన్మానించి తమ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, గుండు క్రిష్ణ, శ్రీనివాస్, ప్రవీణ్, శివరామక్రిష్ణ, గుండు సత్యనారాయణ, హరినాథ్, శ్రీనివాస్, శివలింగం, రాజు, కుర్మ శంకర్, లక్ష్మీ, గోపిక్రిష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ప్రభుత్వ వేం నరేందర్ రెడ్డి

రసూల్‌పురా: పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీ పార్టీతో మనం పోరాటం చేస్తున్నామని ప్రతి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని రాష్ట ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ కంటోన్మెంట్ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు కుట్ర పన్ని, అరెస్టు చేసి జైలుకు పంపి కొడంగల్ ఎన్నికల్లో ఓడించారని కాని ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీగా ప్రజలు ఆదరించడం వల్లనే ఈ రోజు రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని అన్నారు . ఇక బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టుగా మాట్లాడుతున్నారని అవినీతిలో కూరుకుపోయి జైలుకు వెళ్తానని భయపడి బీజేపీలో చేరి ప్రశ్నించే గొంతుక అవుతానని ప్రగల్భాలు పలుకుతున్నాడని ఆయన ఆదర్శ భావాలు, లెఫ్ట్ బావాలు ఎక్కడికి పోయాయో అని ఎద్దేవా చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నాయకుల ఆమోదం తీసుకుని సునీతా మహేందర్ రెడ్డిని అభ్యర్థిగా రేవంత్ రెడ్డి ప్రకటించారని వచ్చే ఎన్నికల్లో సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని కంటోన్మెంట్‌తో సహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలపై పూర్తి అవగాహన ఉందని ప్రజలకు అందుబాటులో ఉంటూ సీం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల, బొల్లు కిషన్, శ్రీగణేష్. జై ప్రకాష్, రాంకుమార్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

సావనీర్ ఆవిష్కరణ


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొ.రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ సింపోజియాల సందడి నెలకొంది. శుక్రవారం వివిధ విభాగాలలో సదస్సులు, సమావేశాలతో పాటు, వివిధ రకాల ఆటపాటలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో హెడ్ ప్రొ.ఎంసీఎస్. రెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి వీసీ ప్రొ.రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై సావనీర్‌ను ఆవిష్కరించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొ.మంగు, డాక్టర్ విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషరఫ్ అలీ ఫారుఖీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఈసీలో జరిగిన ఇన్ఫినిటీ కార్యక్రమానికి ఐటీఈసీ డైరెక్టర్ రమాదేవి, ఈసీఈలో జరిగిన ఆకృతి, సివిల్ ఇంజినీరింగ్‌లో జరిగిన నిర్మాణ, బయోమెడికల్ ఇంజినీరింగ్ మెడిటెక్, మైనింగ్ ఇంజినీరింగ్‌లో ఐగ్నైట్ పేర్లతో కార్యక్రమాలు నిర్వహించారు. ఏడు ఇంజినీరింగ్ విభాగాలలో జరిగిన కార్యక్రమాలను విద్యార్థుల నాయకత్వంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, డీన్ ప్రొ.మల్లేషం, ఆయా విభాగాల హెడ్స్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మాదిగలకే టికెట్ కేటాయించాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ అసెంబ్లీ ఉప ఎనికల్లో మాదిగలకే ప్రధాన పార్టీలు టికెట్ కేటాయించాలని పలు మాదిగ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన మాదిగల ఆత్మగౌరవ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ పాల్గొని మాట్లాడారు. కంటోన్మెంట్‌లో మాదిగలు అధికశాతం ఉన్నప్పటికి ప్రతి ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మాదిగ కులస్తులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. 50 ఏళ్లుగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై ప్రధాన పార్టీలకు లేఖలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు పరశురాం మాట్లాడుతూ.. మాదిగలను అడ్డుపెట్టుకుని కొందరు నేతలు రాజకీయంగా పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదని ఈసారి మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు దేవేందర్ శాంసన్‌రాజు, శంకర్, శివ, విజయరామరాజు, రాజేందర్, లింగం, నర్సింగ్, మధు, మణిరాం పాల్గొన్నారు.

మట్టి కుండలకు తగ్గని క్రేజ్!


లాలాపేట విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి పాత్రలు



లాలాపేట: నీటిని చల్లగా ఉంచే ఎన్నో రకాల ఫ్రిడ్జ్‌లు అందుబాటులోకి వచ్చినా మట్టి కుండలకు మాత్రం ఆదరణ తగ్గడం లేదు. ఆరోగ్యం దృష్ట్యా ప్రజలు మట్టితో తయారు చేసిన పాత్రలు, కుండలను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. మారుతున్న కాలానుగుణంగా కుమ్మర్లు, తయారీదారులు మట్టితో కుండలతో పాటు వివిధ రూపాల్లో రంజన్లు, వాటర్ బాటిల్‌ను తయారు చేసి వినియోగదారులకు మార్కెట్‌లో అందుబాటులో తీసుకవస్తున్నారు. మరింత సౌకర్యం కోసం వాటికి ట్యాప్‌లను అమర్చారు. లాలాపేట అంబేడ్కర్ విగ్రహం సమీపంలో కుమ్మర్లు రోడ్డు పక్కన కుండలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. మట్టి కుండలో నీరు తాగటంతో ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలు చేకూరుతాయని వైద్యులు సైతం సూచిస్తున్నారు. మట్టితో తయారు చేసిన వాటర్ బాటిళ్లు, కుండలకు గిరాకీ పెరుగుతోందని నిర్వాహకులు కుమ్మరి అంజనేయులు పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో చేరడం సామాజిక బాధ్యత


అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న డాక్టర్ రామచంద్రం

సికింద్రాబాద్: జాతీయ సేవా పథకంలో విద్యార్థులు చేరడం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ప్రవీణ్ సొదా కోరారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'ఎన్ఎస్ఎస్ వలంటీర్లు–సామాజిక బాధ్యత' అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రవీణ్‌సొదా మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే సామాజిక అంశాలపై అవగాహన కలిగించుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా చేరడం.. సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు అవడం తద్వారా చేకూరే ఫలితాలను ఆయన వివరించారు. మోటివేషనల్ స్పీకర్ గాడేపల్లి అన్నపూర్ణ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, అంకితభావం పెరుగుతుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ సాధించే పద్ధతుల పట్ల ఆమె అవగాహన కలిగించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృష్ణమూర్తి, కళాశాల ఆచార్యులు డాక్టర్ చిన్నబాబు, డాక్టర్ బాణాల శ్రీనివాస్‌రావు, డా.హరికిషన్ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషిచేయాలి

గాంధీఆస్పత్రి: క్షయ వ్యాధిని దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు కోరారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీని సమూలంగా నియంత్రించే దిశగా దేశం అడుగులు వేస్తుందని, క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా నిర్మాణాత్మకమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే నియంత్రణ సులభమన్నారు. 'ఎస్–ఉయ్ కెన్ ఎండ్ టీబీ' నినాదంతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ చైతన్య ర్యాలీ నిర్వహించారు. గాంధీ రెస్పిరేటరీ మెడిసిన్ హెచ్‌ఓడీ ఎంజీ కృష్ణమూర్తి, వైద్యులు రాములు, శ్రీశ్వేత, ఆర్ఎంఓ–1 జయకృష్ణ పాల్గొన్నారు.



నీటిని పొదుపుగా వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటి

రాంగోపాల్‌పేట్: నీటిని పొదుపుగా వాడకుంటే భవిష్యత్‌లో నీటి కొరత తీవ్రంగా ఉంటుందని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ వాటర్ డే ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటిని పొదుపుగా వాడుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం, నల్లాలను కట్టేయడం, పైపుల లీకేజీలను వెంటనే మరమ్మతులు చేయడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ రేవతి, రాములు, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న తల్లికూతుళ్లకు సన్మానం

సనత్‌నగర్: మారణాయుధాలతో వచ్చిన దుండగులతో పోరాడిన పైగా కాలనీ తల్లీకూతుళ్లను మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ సన్మానించారు. హైదరాబాద్ పోలీస్ కూడా వేగంగా స్పందించి పారిపోతున్న వారిని పట్టుకున్నారన్నారు. పటిష్ట భద్రత ఉన్నా ఇలాంటివి జరగడం బాధాకరమన్నారు. ప్రశాంతమైన ఈ కాలనీ చౌరస్తాలో వైన్‌షాపు తెరిచారని, అక్కడే ఓపెన్ బార్‌లా పెట్టి తాగుతుండడంతో మహిళలు నడవలేని పరిస్థితి ఉందన్నారు. వైన్‌షాపు వద్దనే మద్యం తాగే పద్ధతికి స్వస్తి చెప్పాలని దీనిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అలాంటి వారిని వీసీలుగా నియమించకండి

ఉస్మానియా యూనివర్సిటీ: అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన అధ్యాపకులను వర్సిటీలకు వీసీలుగా నియమించవద్దని ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం సమర్పించారు. పదోన్నతుల ద్వారా తీసుకున్న వేతనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇంకుడు గుంతల ఏర్పాటు తప్పనిసరి

సికింద్రాబాద్: భూగర్భ జలాలను పరిరక్షించుకోవడం కోసం ఇంకుడు గుంతలు (వాటర్‌పిట్స్) ఎంతో అవసరమని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్ చెప్పారు. వరల్డ్ వాటర్‌డే సందర్భంగా శుక్రవారం వివిధ సర్కిళ్ల పరిధిలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బంది సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని గృహ నిర్మాణదారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో 300 గజాల స్థలం దాటిన నిర్మాణాలు ఎన్ని ఉన్నాయి అందులో వాటర్‌పిట్స్ నిర్మించుకుని ఉన్నవారు ఎందరు ఉన్నారన్న సర్వేను సర్కిళ్ల వారీగా చేపట్టినట్టు చెప్పారు. ఇంకుడు గుంతలు లేని గృహాలకు చెందిన వాటర్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ కనెక్షన్ నెంబర్, ప్రాపర్టీ ట్యాక్సు వివరాలను సేకరిస్తున్నామన్నారు.

పొంచి ఉంది ప్రమాదం..
పట్టించుకోరేం?



ప్రమాదం జరిగితే తప్ప.. అధికారుల్లో చలనం లేకుండా పోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు శేషాచల కాలనీలో ఓ విద్యుత్ స్తంభం ఓ వైపు వంగి ప్రమాదకరంగా మారింది. స్తంభం ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు.

–కంటోన్మెంట్